జనగామ
బుధవారం 9 ఏప్రిల్ 2025
WEDNESDAY, APRIL 9, 2025

జనగామ మున్సిపల్ ఆఫీస్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

మున్సిపల్ ఆఫీస్‌లో కలెక్టర్ తనిఖీలు

- ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణను వేగవంతం చేయాలి
- 25 శాతం రాయితీని సద్వినియోగించుకోవాలి : కలెక్టర్

జనగామ, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : జనగామ మున్సిపల్ ఆఫీస్‌ను జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియ, రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులపై అధికారులతో సమీక్షించారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ ఆన్‌లైన్ విధానాన్ని పర్యవేక్షించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాజీవ్ యువ వికాసం పథకంలో ఇప్పటివరకు స్వీకరించిన ఆన్‌లైన్ దరఖాస్తులపై ఆరా తీశారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెల 14వ తేదీ వరకు రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తుదారుల భూముల పరిశీలన వేగంగా చేపట్టాలని, అభ్యంతరాలు లేని వాటికి ప్రొసీడింగ్స్ జారీ చేయాలని ఆయన కోరారు. ఎల్ఆర్ఎస్‌లో ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇస్తున్న విషయమై ప్రజలకు వివరించాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) ఉంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేదని కలెక్టర్ వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో ఈనెల 14వ తేదీ లోపు దరఖాస్తు చేయాలని కోరారు. https:// tgobmms.cgg.gov.inలో దరఖాస్తు చేసుకొని, దీనికి సంబంధించిన ధ్రువపత్రాలను మునిసిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సహాయ కేంద్రంలో అందజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎస్‌డీవో విక్రమ్, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, టీపీఎస్ ప్రశాంతిపాల్గొన్నారు.

నేడు కడవెండిలో రేణుక సంస్మరణ సభ

రేణుక (ఫైల్)

దేవరుప్పుల, ఏప్రిల్ 8: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా బీజాపూర్ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు నేత గుమ్మడవెల్లి రేణుక సంస్మరణ సభ ఆమె స్వగ్రామం మండలంలోని కడవెండిలో బుధవారం జరుగనుంది. గత నెల 31న ఉదయం 9 గంటలకు దంతేవాడ జిల్లా భైరాన్‌ఘర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీజాపూర్ సరిహద్దులోని ఇంద్రావతి నది ఒడ్డున జరిగిన ఎన్‌కౌంటర్‌లో గుమ్మడవెల్లి రేణుక అలియాస్ చైతు అలియాస్ సరస్వతి అలియాస్ భాగ్య మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహానికి ఈ నెల 2న కడవెండిలో అంత్యక్రియలు జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రజాసంఘాల నేతలతో బుధవారం కడవెండిలోని తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య స్తూపం వద్ద రేణుక సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు ఆమె తండ్రి గుమ్మడవెల్లి సోమయ్య విలేకరులకు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగ సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అయిన శ్రీ బొల్లం ప్రదీప్ కుమార్ తండ్రి: ఆనంద్‌రావు, నివాసం: ఇ.నెం. 18-1/14/1/202, ఆదర్శనగర్ కాలని, ఫిర్జాజిగూడ, ఘట్‌కేసర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గారి యొక్క ఒరిజినల్ రిజిస్ట్రేషన్ లింక్ విక్రయ దస్తావేజు vide Doct. No. 4856/2007 గలది బైక్‌పై జనగామ బస్టాండ్ నుండి జనగామ రైల్వే స్టేషన్ వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. అట్టి డాక్యుమెంటు ఎవరికైన దొరికినచో క్రింద తెలిపిన ఆఫీస్‌కు సమాచారం తెలుపగలరు. ఇట్టి బహిరంగ ప్రకటన నా క్లయింటు కోరిక మేరకు ఇవ్వడమైనది.

జనగామ,
తేది: 08-04-2025

సం/-ఎండబట్ల పరుషరాములు
B.A, LL.B.,
అడ్వకేట్,
R/o Jangaon Town, Jangaon Dist.
Cell:9441142645

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **UPPU ANITHA** R/o H.No. 2-105, Devunoor, Dharmasagar Mandal, Hanumakonda Dist - 506371, Telangana. My name changed as **AIRRABELLY ANITHA DEVI (Old Name)** to **UPPU ANITHA (New Name)** for all purposes.

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథపల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777135 MULUGU
9182777135 MAHABUBABAD
9182777557 JANGAON
9182777565

మిల్లర్లు నిబంధనలు పాటించాలి

- రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలి
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ రూరల్, ఏప్రిల్ 8 : నిబంధనలకు అనుగుణంగా మిల్లర్లు వ్యవహరించాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శామీర్‌పేట, వడ్లకొండ గ్రామాల్లో ఐకేపీ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాల్లో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఇవి దేశంలోనే అత్యుత్తమంగా, పారదర్శకంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుతో ప్రారంభమైన ఈప్రయాణం 2023 నుంచి ఇప్పటి వరకు రెండు సీజన్లలో కలిపి కోటి 42 లక్షల మెట్రిల్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారన్నారు. ఒకప్పుడు ఎఫ్‌సీఐ మనకు కేవలం 30 నుంచి 40 లక్షల టన్నుల వరకు మాత్రమే అనుమతి ఇచ్చేదన్నారు. తెలంగాణలో సాగునీటి సదుపాయంతో పెరిగిన పంటల విస్తీర్ణం, రైతుల కృషితో ధాన్యం రాబడులు పెరిగాయన్నారు. పంజాబ్ రాష్ట్రం మాదిరిగా ధాన్యం దిగుబడులు పెరగడంతో ప్రస్తుతం ఒక సీజన్‌లో 80 లక్షల టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని వివరించారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలి

సాగునీటి కొరతతో ధాన్యం దిగుబడులు ఈసారి తగ్గాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉన్న పంటను కాపాడుకుని కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. తేమలేకుండా ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. మిల్లర్లు నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే సీజన్ వరకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని పల్లా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు, జనగామ మార్కెట్ మాజీ చైర్మన్లు బాల్దె సిద్ధిలింగం, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, ఎంపీడీవో ఉప్పగల్లు సంపత్‌కుమార్, ఐకేపీ ఎంపీఎం కవిత పాల్గొన్నారు.

బ్రిడ్జి పనుల పెండింగ్‌పై మంత్రి కోమటిరెడ్డితో మాట్లాడిన ఎమ్మెల్యే పల్లా

వడ్లకొండలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్, ఏప్రిల్ 8 : జనగామ- హుస్నాబాద్ ప్రధాన రహదారిలో వడ్లకొండ వద్ద చేపట్టిన బ్రిడ్జి పనులు పెండింగ్‌లో ఉండడంపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరా తీశారు. దీనిపై అనేక సార్లు అసెంబ్లీలో మాట్లాడినా పనులు వేగవంతం కాని విషయమై మంగళవారం రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పల్లా తెలిపారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పెండింగ్ బిల్లు టోకెన్ నంబర్ పంపితే వెంటనే అధికారులకు తెలిపి నిధులు విడుదల చేసి మిగిలిన పనులు పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. అనంతరం పల్లా మాట్లాడుతూ మూడు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని, లేకుంటే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. మరోవైపు కాంట్రాక్టర్‌తో పల్లా ఫోన్‌లో మాట్లాడారు. బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు, మాజీ మార్కెట్ చైర్మన్లు గాడిపల్లి ప్రేమలతారెడ్డి, బాల్దె సిద్ధిలింగం, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షురాలు బొల్లం శారద, రైతుబంధు సమితి మండల మాజీ కోర్డినేటర్ బూరెడ్డి ప్రమోద్ రెడ్డి, బీఆర్ఎస్ మండల కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు నామాల భాస్కర్, నాయకులు రామ్మోహన్ రెడ్డి, దయాకర్ పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలి : సీపీఎం

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 8 : కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు నెహ్రూపార్కు వద్ద సీపీఎం కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మళ్లీ పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను పెంచడం వల్ల సామాన్యులు మరింత కృంగిపోయారని వివరించారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కట్టెల పొయ్యే దిక్కయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా కేంద్రంలో పెట్రోలియం ఉత్పత్తుల ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూడిద గోపి, చందునాయక్, లింగం, లలిత, శ్రావణ్, బీరయ్య, శ్రీకాంత్, వెంకటేశ్, మల్లేశ్ రాజ్, దుర్గాప్రసాద్, కుమార్, మదార్, సుధాకర్, సౌందర్య, సురేశ్, లక్ష్మి, యాదమ్మ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

బచ్చన్నపేట, ఏప్రిల్ 8: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని చేర్యాల మార్కెట్ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత అన్నారు. మంగళవారం మండలంలోని కట్కూర్, బండనాగారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. శ్వేత మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకుని మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు హరీశ్, నాయకులు నిడిగొండ శ్రీనివాస్, రాములు, సందీప్, అఖిల్, నర్సింహులు, కొండ స్వామి, సీతయ్య బాలస్వామి పాల్గొన్నారు.

నకిలీ రసీదులతో డబ్బులు స్వాహా చేసిన వారిపై చర్య తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పాలకుర్తి, ఏప్రిల్ 8: వల్మిడి సీతారాముల కల్యాణ మహోత్సవంలో భాగంగా నకిలీ రసీదు బుక్స్ సృష్టించి డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ కత్తి సైదులు, దేవస్థాన మాజీ చైర్మన్ చెరుకు రాములు ఉన్నతాధికారులను కోరారు. మంగళవారం వారు బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసిన వల్మిడి కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేశారని చెప్పారు. కార్యనిర్వహణాధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి డబ్బులు వసూలు చేస్తే ఈవో ఏం చేస్తున్నాడని మండిపడ్డారు. ఈవోనే స్వయంగా తన సంతకం ఫోర్జరీ చేశారని చెప్పారని, పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశడన్నారు. అయినా పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి ప్రోద్బలంతోనే కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేయడంలేదని వారు ఆరోపించారు. దేవుడి పేరుతో ఎమ్మెల్యే రాజకీయాలు చేయడం తగదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ సహకారంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వల్మిడి దేవాలయాన్ని మరో భద్రాద్రిగా తీర్చిదిద్దడన్నారు. రూ.50 కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేసిన దయాకర్‌రావుకు ఆహ్వానం పంపలేదన్నారు. దయాకర్‌రావు మంజూరు చేసిన నిధులకు ఎందుకు ఖర్చు చేయడం లేదన్నారు. నకిలీ రసీదు బుక్స్‌తో కాంగ్రెస్ నాయకులు లక్షలాది రూపాయలు స్వాహా చేశారన్నారు. ఈవో, కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కై డబ్బులు స్వాహా చేశారని మండిపడ్డారు. ఈవోపై దేవాదాయ శాఖ కమిషనర్, కలెక్టర్, వరంగల్ సీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పంగ సైదులు, వీరమల్ల రాజు, వెన్నమనేని మురళీధర్‌రావు, నీరటి సోమయ్య, మారిపెల్లి ఆంజయ్య, పర్వత వెంకటయ్య, మోకాటి ఎల్లయ్య, కేసారపు శ్రీనివాస్‌రెడ్డి, దూపతి వెంకటయ్య, తండా శ్రీనివాస్, చెరుకు నరేందర్, గుణిగంటి వాసురావు, బోలగాల శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చకుంటే ఊరుకోం

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకుడు జువారి రమేశ్.

జఫర్‌గఢ్, ఏప్రిల్ 8 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెర వేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జువారి రమేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని తమ్మడపల్లి(ఐ)లో మంగళవారం మంద బుచ్చయ్య అధ్యక్ష తన గ్రామ మహాసభ నిర్వహించారు. పార్టీ జెండాను సీనియర్ నాయకుడు తాడెం వెంకటయ్య ఆవిష్కరించారు. జువారి రమేశ్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారం లో ఉన్న బీజేపీ ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతున్నదన్నారు. వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచిందన్నారు. రైతులకు ఇచ్చే సబ్సిడీలను కేంద్రం ఎత్తి వేస్తున్నదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైందని రమేశ్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, దొడ్డు ధాన్యానికి కూడా రూ.500 బోనస్ చెల్లించాలని రమేశ్ డిమాండ్ చేశారు. అనంతరం నూతన గ్రామ కమిటీ కార్యదర్శిగా మంద బుచ్చయ్య, సహాయ కార్యదర్శిగా బుల్లె సాయిలును ఎన్ను కున్నారు. కార్యక్రమంలో నాయకులు కదురు యాకయ్య, ఆకుల యాకయ్య, బుల్లె రాములు, మంద లక్ష్మి, లింగమ్మ, ఎడ్ల పోశయ్య, గోనె రాజయ్య, పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామి ఆలయ చైర్మన్‌గా నీల నర్సింహులు

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 8 : స్టేషన్‌ఘన్‌పూర్‌లోని తిరుమలనాథస్వామి ఆలయ చైర్మన్‌గా నీల నర్సింహులును నియమించారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారికంగా నూతన కమిటీని ప్రకటించి మంగళవారం నియామక పత్రం అందించారు. ఆలయ చైర్మన్‌గా నీల నర్సింహులు, వైస్ చైర్మన్‌గా తాటికొండ యాదగిరి, డైరెక్టర్లుగా గట్టు ప్రశాంత్, పిట్టల లక్ష్మీనారాయణ, మునిగెల కుమారస్వామి, గౌరిశెట్టి శ్రీనివాస్, గోనెల ఎల్లయ్య, చెరిపల్లి రాములు, గుంటి శేఖర్, గట్టు శ్రీవాణీవెంకటస్వామిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, రాపోలు మధుసూదన్ రెడ్డి, నీల శ్రీధర్, సున్నం యాదగిరి, నీల సోమన్న, గాంధ్ల రాజు, గోనెల అనిల్, సింగపురం ఎల్లయ్య, గోనెల ఎల్లయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలుంటే కఠిన చర్యలు

తరిగొప్పుల, ఏప్రిల్ 8: ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి స్వరూపారాణి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని అంకుషాపూర్ గ్రామ పంచాయితీ స్థలం, వర్షపు నీరు వెళ్లే కాల్వ(ఒర్రె)పై అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు రావడంతో మంగళవారం తహసీల్దార్ నాగేశ్వరాచారి, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. వర్షపు నీరు వెళ్లే (ఒర్రె) కాలువ స్థలం రోడ్డు నక్ష్యాలో ఉంది. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి స్వరూపారాణి మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేస్తే కూల్చివేతలు తప్పవన్నారు. ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఎంపీవో మాలతి,ఆర్ఐ రవీందర్, పంచాయతీ కార్యదర్శి అమనగంటి మహేందర్, కారోబార్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రఘునాథపల్లి, ఏప్రిల్ 8: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని కంచనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు వివిధ గ్రామాలకు వెళ్తారని, అక్కడి అపరిచితులతో జాగ్రత్త వ్యవహరించాలని సూచించారు. పరిచయం లేని వ్యక్తులతో మాట్లాడి మోసాల భారీన పడకుండా తల్లి దండ్రులు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. విద్యార్థులు వ్యసనాయలకు దూరంగా ఉండాలని, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు సకాలంలో అందించాలి

యూనిఫామ్ క్లాత్‌ను ఇస్తున్న ఎంపీడీవో

దేవరుప్పుల, ఏప్రిల్ 8: విద్యా సంవత్సరం ఆరంభం నాటికే పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందేలా చూడాలని ఎంపీడీవో లక్ష్మీనారాయణ అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇచ్చే క్లాత్‌ను ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంఈవో కళావతి మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని 47 ప్రభుత్వ పాఠశాలల్లో 1859 మంది విద్యార్థులున్నారని తెలిపారు. వీరికి జత యూనిఫామ్‌ను మే 1వ తేదీ వరకు అందించాలన్నారు. కాగా యూనిఫామ్స్ బాధ్యతను చందన మండల సమాఖ్యకు చెందిన ఆరుగురు సభ్యులు తీసుకున్నారు. ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ గోలి రజిత, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విష్ణు, రాజేంద్రకుమార్, ఎంఈఆర్‌సీ సిబ్బంది గోలి రవీందర్‌రెడ్డి, నర్సింహులు, యాకస్వామి, మంజుల, రాంచందర్ పాల్గొన్నారు.

పాలకుర్తి తహసీల్దార్ శ్రీనివాస్ బదిలీ

- జనగామ ఆర్డీవో ఆఫీస్‌లో డీపవోగా పోస్టింగ్
- 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

పాలకుర్తి, ఏప్రిల్ 8: పాలకుర్తి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న పొట్టబత్తుల శ్రీనివాస్‌పై వేటు పడింది. 'రూ.30 వేలిస్తేనే చెక్కు ఇస్తా' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం వెలువడిన కథనంపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు స్పందించారు. దీనిపై వివరాలు తెలుసుకున్న అనంతరం శ్రీనివాస్‌ను జనగామ ఆర్డీవో ఆఫీస్ డీపవోగా బదిలీ చేశారు. ఈ విషయం చర్చనీయాంశమైంది. మరోవైపు తరిగొప్పుల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగేశ్వరాచారిని పాలకుర్తి తహసీల్దార్‌గా బదిలీ చేసినట్లు సమాచారం. కాగా దేవరుప్పుల తహసీల్దార్ మహిపాల్‌రెడ్డిని తరిగొప్పులకు ట్రాన్స్‌ఫర్ చేశారు. జనగామ ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న అండాల్‌ను దేవరుప్పుల తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

బీఆర్ఎస్ దళిత నాయకుడు విజయ్ అరెస్ట్

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 8 : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని జనగామ న్యూస్ అఫీషియల్ అనే సోషల్ మీడియా వాట్సాప్ గ్రూప్‌లో అసభ్య పదజాలంతో విమర్శించారన్న కారణంతో జనగామ జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ దళిత నాయకుడు తిప్పారపు విజయ్‌ని మంగళవారం అర్బన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అదేవిధంగా డాక్టర్ గదరాజు చందు అనే మరో నాయకుడిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బోనాసి క్రాంతి కుమార్ ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్ నాయకులిద్దరిపై క్రైమ్ నంబర్ 176/25, యు/ఎస్ 196, 352, 353 (2), బీఎన్ఎస్ 67 ఐటీ యాక్ట్ 2008 కేసులు పెట్టి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు. ఇదే కాకుండా విజయ్‌పై ఇది వరకు పలు రకాల కేసులు నమోదై ఉండడంతో రౌడీ షీట్ కూడా ఓపెన్ చేసి ఉన్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా జైలుకు పంపడం పిరికిపంద చర్య : ఎమ్మెల్యే పల్లా

బీఆర్ఎస్ జనగామ పట్టణ దళిత నాయకుడు తిప్పారపు విజయ్‌ని అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం పిరికిపంద చర్య అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 16 నెలల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపడం నిత్యకృత్యం అయిందన్నారు. గ్రామాల్లో నీళ్లు రావట్ల